క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

వీరఘట్టం: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆవిష్కరించారు. వీరఘట్టం మండలం ఎం.రాజపురంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎమ్మెల్యే జయకృష్ణను కలిసారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతున్న వీరిని ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘ నాయకులు అన్ను వెంకటరావు, దూసి శ్రీబాబు, సూర్యనారాయణ, ప్రసాదరావు తదితరులున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

సీతంపేట: గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో మంగళవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్‌కనెక్టివిటీ రోడ్లుకు రహదారులు నిర్మించాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం జన్‌మన్ పథకంలో మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ గీతాంజలి, వ్యవసాయాధికారి శ్రీదేవి, పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ కిరణ్‌కుమార్, హౌసింగ్ ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం కావాలి



అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారిణి అను

కొమరాడ: పాడిరైతులంతా పశువ్యాధులపై అప్రమత్తం కావాలని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం పశుసంవర్ధక శాఖ అధికారిణి డాక్టర్ అను సూచించారు. మండలంలోని రాజ్యలక్ష్మీపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి హాజరైన ఆమె.. సిబ్బందితో పలు మూగజీవాలకు వ్యాధులు రాకుండా ముందస్తు నివారణగా టీకాలు వేశారు. అలాగే పశువులకు వైద్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

తక్షణ సాయం అందించి ప్రాణాలు కాపాడండి

పార్వతీపురంటౌన్: ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు తక్షణసాయం అందించి ప్రాణాలు కాపాడాలని జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గా ప్రసాద్ రెడ్డి అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రైవేట్ ఆస్పత్రులు, జన కూడలి ప్రదేశాల్లో గుడ్ సామారిటన్ పోస్టర్లను అతికించి గోల్డెన్ అవర్‌లపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగిన గంటలోగా క్షతగాత్రులను దగ్గరుండి ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడే వారే నిజమైన హీరో అని అభివర్ణించారు. గాయపడిన వారి పట్ల కరుణ, సాయం చేసే మానవత్వం ఉండాలని హితవు పలికారు. క్షతగాత్రులకు సాయం చేసిన వారికి ప్రభుత్వం రూ.5వేలు ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శశికుమార్, జి.సత్యనారాయణ, ఎన్.రమేష్ కుమార్, బి. కాశీరాం నాయక్, ఎ.వరప్రసాద్, రవాణా శాఖ, అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పాత మేట్‌లను కొనసాగించాలి

సీతానగరం: మండలంలోని నిడగల్లులో పాత మేట్‌లను కొనసాగిస్తూనే కొత్తమేట్‌లను అవసరాలకు అనుగుణంగా నియమించాలని కోరుతూ సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిడగల్లు వికలాంగ వేతనదారులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ మేరకు సీఐటీయూ డివిజన్ నాయకుడు వెంకటరమణ, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకుడు రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా నిడగల్లులో వీరంతా పని చేస్తున్నారని అప్పట్లో నియమితులైన వారిలో ఒకరిని మేట్‌గా నియమించుకున్నారన్నారు. ఇప్పుడా మేట్‌లను తొలగించి కొత్తవారిని అధికారులు నియమించడానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని, అందుకు వేతనదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. పాలకులు మారినప్పుడల్లా మేట్‌లను మార్చడం తగదన్నారు. కార్యక్రమంలో వికలాంగ వేతనదారులు పాల్గొన్నారు. వారంతా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావుకు అందజేశారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

పాచిపెంట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్ఓ భాస్కరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీకి వస్తున్న రోగులు, వారికి అందిస్తున్న చికిత్స తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణుల్లో రక్తహీనతను తగ్గించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అందరూ నిబద్ధతతో పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మన్యం పనసకు డిమాండ్

- గ్రామాల్లో వ్యాపారులు విస్తృతంగా కొనుగోలు
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- రూ.కిలో రూ.25కు కొనుగోలుచేస్తున్న వ్యాపారులు
- పదివేల ఎకరాల్లో పంట విస్తరణ
- 12 వేల టన్నుల వరకు దిగుబడి



సీతంపేట మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

సీతంపేట:

మన్యం పనస రుచే వేరు. సీతంపేట ఏజెన్సీలో పండే పనసను ఇతర రాష్ట్రాల్లోని హోటళ్లు, వివాహాది శుభకార్యాల్లో విరివిగా వినియోగిస్తారు. పనసతో బిర్యాని, రకరకాల కూరలు వండుతారు. సేంద్రీయ ఎరువులతో పండే ఈ ప్రాంత పనసకు పశ్చిమబెంగాల్, ఒడిశా, మహరాష్ట్ర, బిహార్ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. పనసకాయల కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపుతుండడంతో గిరిజనులు ఆదాయం సమకూరుతుంది. ఏడాదిలో రెండుసార్లు పనసచెట్లు కాపుకొస్తాయి. జనవరి, ఫిబ్రవరి, మార్చినెలల్లో కాసే కాయలను లేత దశలో కూరల నిమిత్తం అమ్మకాలు జరుపుతారు. జూన్ నుంచి మరో కాపు వస్తుంది. అప్పటి పనస కాయలను పండ్ల రూపంలో విక్రయించి గిరిజన రైతులు ఆదాయం ఆర్జిస్తారు.

పదివేల ఎకరాల్లో..

సీతంపేట ఏజెన్సీలో సుమారు 10 వేల ఎకరాల్లో పనస పంట విస్తరించి ఉంది. కొండపోడు వ్యవసాయంలో ప్రతీ చోట పనస చెట్లు ఉన్నాయి. ఈ పంట సాగుకు అంతగా పెట్టుబడులు అవసరం లేదు. దాదాపు 12 వేల టన్నులు దిగుబడి వస్తుంది. కిలో రూ.25కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వీటిని ఇతర రాష్ట్రాలకు లారీలు, వ్యాన్‌లలో లోడ్ చేసి ఎగుమతి చేస్తారు. అక్కడ కిలో రూ.40 వరకు విక్రయిస్తారని సమాచారం. సీతంపేట, దోనుబా యి, కుశిమి, శంబాం, మెట్టుగూడ తదితర గ్రామా ల్లో ఎక్కువగా పంట పండుతుంది. ఆయా ప్రాంతాలకు వ్యాపారులు వెళ్లి కొనుగోలు చేస్తారు. అలాగే వారపు సంతల్లో కూడా గిరిజనులు విక్రయిస్తున్నారు.

ధరలు తగ్గుతున్నాయి..



వారం, వారం ధరలు తగ్గుతున్నాయి. సీజన్ ప్రారంభంలో కిలో రూ.35 వరకు కొనుగోలు చేసేవారు. ఇప్పుడు రూ.10వరకు ధర తగ్గింది. గ్రామాల్లో కాటాలు వేసి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇంకా ధరలు తగ్గితే నష్టాలు తప్పవు.

– వెంకి, కోతాం గ్రామం

మంచి ఆదాయ వనరు



పంట దిగుబడులు వస్తే మంచి ఆదాయవనరుగా చెప్పవచ్చు.పనసకాయలకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ మాత్రం కొద్దిగా ధరలు తగ్గుతున్నాయి. ఆటోలు, వ్యాన్‌లలో వారపు సంతల వద్దకు తీసుకువెళ్లి విక్రయించడం జరుగుతుంది.

– ఎస్.జోషి, కాంగూడ

శ్రమదానంతో సంత పరిసరాలు శుభ్రం



సంత వద్ద పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుతున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక వారపుసంత వద్ద సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావుతో పాటు స్థానికులు మంగళవారం శ్రమదానం చేశారు. సంత పరిసరాలన్నీ ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో నిండిపోవడం చూసి, వారు ఎలాగైనా శుభ్రం చేయాలనుకున్నారు. చీపుళ్లు, కర్రలు చేతపట్టి చెత్తాచెదారం ఊడ్చి దూరంగా పడేశారు. ప్రతీ బుధవారం ఇక్కడ జరిగే సంతకు వచ్చే వారు ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు, పాలిథిన్ కవర్లు వేయడం వల్ల ఇలా అపరిశుభ్రం పేరుకుపోతోందని వారు తెలిపారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంతకు వచ్చే వారికి, వ్యాపారులకు అవగాహన కల్పిస్తామని సర్పంచ్ తెలిపారు.

బాధ్యతతో సామాజిక తోటల పెంపకం చేపట్టాలి



ఉపాధి సిబ్బందిని ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ రామచంద్రమూర్తి, ప్రజాప్రతినిధులు

- డ్వామా పీడీ రామచంద్రమూర్తి

భామిని: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన సామాజిక తోటలు, ఉద్యానవన కార్యక్రమాలకు స్థలం ఎంపిక చేసినప్పుడు మొక్కలు నాటే స్థలంలో భద్రత ఉందా.. లేదా.. ఈసీలు నిశితంగా పరిశీలించాలని డ్వామా పీడీ శ్రీరామచంద్రమూర్తి మంగళవారం ఆదేశించారు. భామినిలో ఎంపీడీఓ కె.సత్యం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ సమావేశంలో డ్వామా పీడీ పాల్గొని మాట్లాడారు. 2023 ఏప్రిల్ 30 నుంచి 2024 మార్చి 31 వరకు సుమారు రూ.18.9 కోట్ల వ్యయం కాగల ఉపాధి పనులపై పరిశీలన చేపట్టారు. ఆద్యంతం ఉపాధి మొక్కల సంఖ్య లేదని సోషల్ ఆడిట్ డీఆర్‌పీలు వివరించడంతో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఫైన్‌లు వేయడం బాధగా ఉందన్నారు. వరదలు, పశువుల నుంచి రక్షణ కల్పించాలన్నారు. లివిరి ఎఫ్ఏ సస్పెన్షన్‌లో ఉండగా ఆయన మస్టర్లపై లోపాలు పట్టరాదన్నారు. ఉపాధి పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయకుండా వచ్చిన నిధులు స్వాహా చేసే ప్రయత్నం చేసారా? అని ఏపీఓ తులసిదాస్, ఈసీ రమణమూర్తిని ప్రశ్నించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామాల్లోకి వెళ్లి పనులు పరిశీలించి గ్రామస్తుల అభిప్రాయం గుర్తించాలని మందలించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లోపాలు వెదికే ముందు ఆ లోపాల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహచలం, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, ఎంపీటీసీ పొట్నూరు ఉషా అధికారులను కోరారు. ప్రతీ సామాజిక తనిఖీలో ఫైన్‌లతో కాలక్షేపం చేయడం తగదన్నారు. ఉపాధి ఏపీడీ శ్రీహరి, కొత్త ఏపీఓ కలిశెట్టి శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ దాస్, ఉపాధి టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

శంబరకు ప్రత్యేక సర్వీసులు



కాంప్లెక్స్‌లో డ్రైవర్లకు సూచనలిస్తున్న డీఎం

పాలకొండ రూరల్: శంబర యాత్రకు సంబంధించి రాజాం మీదుగా పాలకొండ నుంచి ఏడు ఆర్టీసీ సర్వీసులను వేసినట్టు డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. సదరు బస్సుల నిర్వహణకు సంబంధించి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మంగళవారం వాకబు చేసారు. ప్రయాణికులు, ఆర్టీసి సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది ప్రయాణికులతో గౌరవంగా మెలగాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో కూడిన యాత్రకు సంబంధించి విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వ్యక్తిగత, ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేయాలన్నారు. ఇటీవల సంక్రాంతి నేపథ్యంలో ప్రయాణికుల కోసం 68 వేల కిలోమీటర్లు సర్వీసులను అదనంగా నడిపామని, దీంతో పది రోజుల వ్యవధిలో స్థానిక డిపోకు రూ.32లక్షల మేర ఆదాయం సమకూరిందన్నారు. శంబర యాత్ర పూర్తయ్యే వరకు తమ సర్వీసులు నడుపుతామని తెలిపారు.

హర్షం

భామిని: మాదిగలకు ఉప కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ స్థాపించి అణగారిన ఉపకులాలకు గుర్తింపు తెచ్చిన మందా కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం పట్ల భామిని మాదిగ సంఘ నాయకులు మంగళవారం హర్షం వెలిబుచ్చారు. ఈ మేరకు బర్త్‌డే కేక్‌ను మాదిగ నేతల సమక్షంలో కట్ చేసి పంచుకొని పద్మశ్రీ అవార్డు రావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు కవిటి రాజు, లోపింటి చరణ్, లోపింటి అప్పారావు, సంతారాజ్, భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారాయుడుపేటలో సీసీరోడ్డు, కాలువ పనులు

సీతానగరం: మండలంలోని సూరంపేట పంచాయతీ చిన్నారాయుడుపేటలో సర్పంచ్ చిట్టపలి అప్పన్నమ్మ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం జరుగుతోందని కార్యదర్శి మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఏఈ చంద్రమౌళి సూచనల మేరకు గ్రామ ప్రధాన వీధిలో కాలువ, సీసీ రోడ్డు లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న కారణంగా గ్రామ పంచాయతీ నిధులతో సీసీరోడ్డు, కాలువ పనులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించామని తెలియజేశారు.

టెక్నికల్ కోర్సు సర్టిఫికెట్‌లకు డీఈఓ కార్యాలయంలో సంప్రదించండి

పార్వతీపురంటౌన్: 2024లో ఉత్తీర్ణత సాధించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు అభ్యర్థులు డీఈఓ కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థుల పాస్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖాధి కారి కార్యాలయానికి పంపించారని, ఉత్తీర్ణులైన అభ్యర్థులందరూ తప్పనిసరిగా తమ హాల్‌టికెట్ చూపించి పాస్ సర్టిఫికెట్‌ను తీసుకోవాలని పేర్కొన్నారు.

కాఫీ సాగుపై సంయుక్త సర్వే

పాచిపెంట: మండలంలోని శతాబి, గరిసిగుడ్డి, తంగ్లాం పంచాయతీ గ్రామాలలో ఐటీడీఏ కాఫీబోర్డు, ఉద్యానవనశాఖ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం శతాబిగ్రామంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. కాఫీ పంట సాగుకు అనుకూల పరిస్థితులు తదితర అంశాలను వివరించారు. కాఫీ సాగు విస్తరణ కోసం పలు సూచనలు చేశారు. దిగుబడి పెంపుదలకు శిక్షణ ఇస్తామని తెలిపారు.

టూరిజం అభివృద్ధికి చట్టాన్ని సవరించాలి

పార్వతీపురంటౌన్: షెడ్యూల్ ఏరియాలో టూరిజం అభివృద్ధికి చట్టాన్ని సవరించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు అప్పారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో టూరిజం అభివృద్ధి కోసం హోటల్స్, రెస్టారెంట్లు, పార్కులకు పెట్టుబడులు పెట్టాలంటే 1/70 చట్టం సవరణకు రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగం లోతైన అధ్యయనం చేసి సవరణ చేయాలని సాక్షాత్తు శాసన సభాపతి ప్రకటించారన్నారు. ఇది ఆదివాసులకు తీవ్ర ద్రోహం చేయడమేనని ఆదివాసులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టం సవరణ చేస్తే ఆదివాసీ షెడ్యూల్ ప్రాంతంలో బడా పెట్టుబడిదారులకు కార్పొరేట్ కంపెనీలు ఆదివాసీ సంపదలైన సహజవనరులు, అడవులు, ఖనిజాలు, ప్రకృతి అందాలు స్వాధీనం చేసుకుని వ్యాపారం సాగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల జీవన విధానం ధ్వంసమవుతుందని తక్షణమే ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి ప్రకటన వెనక్కు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తోందని స్పష్టం చేశారు.

సంపద సృష్టించి.. సంక్షేమం అమలు చేసేదెప్పుడు?

- కూటమి పాలకులను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే కళావతి



పాలకొండ రూరల్: వెనుకటికి ఒకడు ఏరు దాటాక ఓడ మల్లన్న... ఆపై అధికారం వచ్చాక బోడి మల్లన్న అన్నట్లుంది కూటమి ప్రభుత్వం తీరని, ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన చంద్రబాబు, ఆ కూటమి నాయకులు నేడు మ్యానిఫెస్టో అమలుపై సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఎద్దేవా చేశారు. మంగళవారం ఆమె విలేకరుతో మాట్లాడారు. తాజాగా నీతి అయోగ్ నివేదికపై మాట్లాడుతూ సీఎం సంక్షేమ పథకాల అమలుకు ఇంకా సంపద సృష్టించాల్సి ఉందని, 15 శాతం వృద్ధి రేటు పెరిగితే తప్ప పథకాలు అమలు చేయలేమనే వాఖ్యలు చూస్తే అది ఎప్పుడు జరుగుతుందన్న ప్రశ్న తనతో పాటు రాష్ట్ర ప్రజల్లో ఉత్పన్నమవుతుందన్నారు. దీనికి కూటమి ప్రభుత్వ పెద్దలు స్పష్టమైన సమాధానం చెప్పాలన్నారు. హామీలకు మంగళం పాడే దిశగా అగుడులు పడుతున్నాయని బాబు మాటలు చెబుతున్నాయన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, విజనరీ, ఆర్థిక సంస్కరణల్లో దిట్ట అంటూ గొప్పలు చెప్పిన నాయకులు ఎటువంటి అవగాహన లేకుండానే మోసపూరిత హామీలు ఇచ్చారని దుయ్యబట్టారు. హామీల అమలుకు రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ అమలుకు దాదాపుగా రూ.1,50,718 కోట్ల మేర అవసరమన్నారు. తప్పు జరిగితే ప్రశ్నిస్తామన్న ప్రస్తుత డిప్యూటీ సీఎం ఇప్పుడు తమ కూటమి హామీల అమలు విషయంలో ఎందుకు మిన్నకున్నారో, పవన్‌కు బాధ్యత ఉందో లేదో ప్రజలకు చెప్పాలన్నారు. నేడు కూటమి పాలన తీరు 'సీజ్ దా సంక్షేమం' అన్నట్లుందన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మ్యానిఫెస్టోను ఓ భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించారన్నారు. 2019–24 మధ్య కాలంలో కోవిడ్ వంటి పలు విపత్కర పరిస్థితులు ఎదురైనా ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను అమలు చేసి చూపించారన్నారు. అనతి కాలంలోనే అన్ని వర్గాల ప్రజలు ఏమి కోల్పోయారో తెలుసుకుంటున్నారని, త్వరలోనే కూటమి వైఖరిని ఎత్తిచూపుతూ వారు ఉద్యమాలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. దగాపడ్డ ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ ముందుంటుందని కళావతి తెలిపారు.

అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ఇసుక తరలింపునకు సంబంధించిన అనుమతులు పరిశీలిస్తున్న తహసీల్దార్

పాలకొండ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో ఇసుక తరలిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పి.బాలమురళీకృష్ణ అన్నారు. సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో మంగళవారం పాలకొండ మీదుగా వస్తున్న ఇసుక లారీలను తనిఖీ చేశారు. కొత్తూరు నుంచి ఇసుక తీసుకువస్తున్న రెండు లారీలను నిలుపుదల చేసి, రికార్డులు పరిశీలించారు. పూర్తి అనుమతులు ఉన్నట్లు గుర్తించిన అధికారులు వాహనాలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా తహసీల్దర్ మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలించేందుకు యత్నిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ రవాణ జరగకుండా పోలీస్, రెవెన్యూ సంయుక్త నిఘా, వాహన తనిఖీలు విస్తృతం చేస్తామన్నారు.

దేవదేవుని ప్రతిష్టకు తరలిరావాలి



భక్తులతో సమావేశమైన జట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు పారినాయుడు

జియ్యమ్మవలస: గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి దేవస్థానంలో దేవదేవుడైన శ్రీనివాసుని ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఫిబ్రవరి 5, 6, 7వ తేదీల్లో చేపట్టే దేవదేవుని ప్రతిష్ట కార్యక్రమానికి అందరూ తరలిరావాలని జట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు, ఆలయ కమిటీ పునరుద్ధారకుడు డాక్టర్ డి.పారినాయుడు కోరారు. మండలంలోని గౌరీపురం గ్రామ భక్తులతో మంగళవారం సమావేశమైన ఆయన.. దైవ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆహ్వానించారు.

కీసరలో నేత్ర శిబిరం



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న పుష్పగిరి వైద్యులు

భామిని: మండలంలోని కీసర గ్రామంలో విజయనగరానికి చెందిన శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వలరౌతు ఆధ్వర్యంలో కంటి శిబిరం ఏర్పాటు చేసారు. 60 మంది దృష్టి లోపం ఉన్న వారికి పరీక్షలు నిర్వహించారు. ఆరుగురికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి మందులు అందజేసారు.

వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోండి



మల్లుగూడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నిర్మలాజ్యోతి

గుమ్మలక్ష్మీపురం: రాబోయే ఖరీఫ్ సాగుకు అవసరమైన వ్యవసాయ పరికరాలు కావాలనుకునే వారంతా దరఖాస్తు చేసుకోవాలని కురుపాం ఏడీఏ ఎ.నిర్మలాజ్యోతి తెలిపారు. మంగళవారం మండలంలోని మల్లుగూడలో ఏవో సీహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన ఆమె.. తొలుత రబీ సాగు పంటలపై ఆరా తీసి, అధిక దిగుబడులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ముఖ్యంగా జీడిమామిడి పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలిపారు. నూర్పిడి యంత్రాలు, పిండిమిల్లులకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని, ఎస్సీ, ఎస్టీ రైతులకు అయితే నూర్పిడి యంత్రాలపై రూ.లక్ష, పిండిమిల్లుపై రూ.15 వేల చొప్పున్న సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులంతా ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ బి.దినేష్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి



కుంబిడి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వీరఘట్టం: ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో మంజూరైన గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. కుంబిడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఆయన మంగళవారం పరిశీలించారు. మార్చి నెలాఖరులోపు నిర్మాణాలన్నీ పూర్తి చేయాలని సూచించారు. ఆయనతో పాటు హౌసింగ్ ఏఈ వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వసంతకుమార్, శరత్‌బాబు, రాంబాబు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని జనం కోరుకుంటున్నారు..

- రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్



మాట్లాడుతున్న మామిడి శ్రీకాంత్, పార్టీ నాయకులు

భామిని: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని అందించడంలో పూర్తిగా విఫలమైందని తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. భామినిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబుతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రజలు మళ్లీ సంక్షేమ ప్రభుత్వాన్ని అందించే జగనన్న పాలనను కోరుకుంటున్నారని స్పష్టం చేసారు. గతంలో ప్రతి ఇంటిలో జగనన్న పథకాల వల్ల ఆర్థిక పరిస్థితులు గణనీయంగా మెరుగుపడ్డాయన్నారు. ప్రస్తుత కూటమి పాలనలో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమంపై శ్రద్ధ లేదని ధ్వజమెత్తారు. ధరలను పెంచడంలో చూపే శ్రద్ధ ప్రజా సమస్యలపై చూపడం లేదన్నారు. వారి వెంట ఆ పార్టీ నాయకులు అగతముడి రఘు, బోడెపు శ్రీను, ఎరుకుమజ్జి పాపినాయుడు తదితరులు ఉన్నారు.

పరిశ్రమల్లో లోటుపాట్లు గుర్తించండి



మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ జిల్లా కో-ఆర్డినేటర్

వీరఘట్టం: మండలంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో ఉన్న లోటుపాట్లు గుర్తించాలని పరిశ్రమల శాఖ జిల్లా కో–ఆర్డినేటర్ అశోక్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వచ్చిన తుఫాన్లకు, వర్షాలకు ఏమైనా నష్టం జరిగినా ఆ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఆయనతో పాటు ఎంపీడీఓ బి.వెంకటరమణ ఉన్నారు.

ప్రయాణికుల భద్రతే ముఖ్యం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ

పాలకొండ రూరల్: వాహన చోదకులు ప్రయాణ సమయంలో భద్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.వేణుగోపాలరావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా తన కార్యాలయంలో మంగళవారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించడం, ఫిట్‌నెస్ లేని వాహనాలను నడపడం ప్రమాదకరమని సూచించారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట సహాయ మోటారు వెహికల్ అధికారి జి.నవీన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.